
"ఏమండోయ్...సుబ్బారావుగారూ!" గట్టిగా పిలిచాడు పోస్టు మేన్ వెంకట్రావు.

కనీసం ఒక అరవై మంది ఆగి నిలబడి 'నన్నేనా?' అన్నట్లు ప్రశ్నార్థకంగా చూశారు వెంకట్రావుని. రద్దీగా ఉండే సెంటర్లో సుబ్బారావు అని పిలవటం పొరపాటు అనుకున్నాడు వెంకట్రావు. "మిమ్మల్ని కాదు సార్, మీరు కాదండీ...!" అంటూ సైకిలెక్కి గబగబా తొక్కి వంద గజాల దూరంలో వెళుతున్న సుబ్బారావు పక్కగా ఆపి, "సార్ మీకేదో వెడ్డింగ్ వచ్చింది" బుక్‌పోస్టు అని రాసి ఉన్న వెడ్డింగ్ కవర్ ఇచ్చాడు వెంకట్రావు.

# అబ్బ! సుబ్బారావు దొరికాడు!!

పి.ఎస్. రామచంద్రుడు



"థాంక్యూ!" అని కవర్ ఓపెన్ చేసి వెడ్డింగ్ కార్డు తీసి చూశాడు సుబ్బారావు. 'సుషీల్ వెడ్స్ శ్వేత- రామకృష్ణ కళ్యాణ మండపం, టి. నగర్, మద్రాసు' అని ఉంది.

ఎవరీ సుషీల్? ఈయ నెందుకు పెళ్ళిచేసుకుంటున్నాడు? పెళ్ళిచేసుకుంటే నా కెందుకు ఇన్విటేషన్ పంపించాడు? అర్థంకాలేదు సుబ్బారవుకి. "నాకు కాదయ్యా ఇది" అని వెంకట్రావుకిచ్చి వెళ్ళిపోయాడు సుబ్బారావు.

టు అడ్రస్ క్లియర్‌గా చూశాడు వెంకట్రావు. సిహెచ్. సుబ్బారావు, కొత్తపేట, గుంటూరు. 'ఓహో...చీమకుర్తి సుబ్బారావుగారికి వస్తే ఈయన కిచ్చాను' అనుకున్నాడు వెంకట్రావు. సైకిలెక్కి చీమకుర్తి సుబ్బారావు ఇంటికి వెళ్ళి వెడ్డింగ్ కార్డు ఇచ్చాడు.

"పెళ్ళంటే నూరేళ్ళ పంటా...అది పండాలీ కోరుకున్న వారి ఇంట పండాలీ" వెడ్డింగ్ తీసుకొని ఓపెన్ చేస్తూ పాడాడు చీ. సుబ్బారావు. శుభలేఖని రెండు నిముషాలు పరీక్షగా చూసి నవ్వి "ఇది నాకు కాదు" బహుశా చామర్తి సుబ్బారావుకి అయి ఉంటుంది."

"అయ నెవరండీ? ఎక్కడుంటాడు?" అడిగాడు వెంకట్రావు.

"ఫస్టు లెఫ్ట్, రైట్ సైడ్ థర్డ్ హౌస్" అడ్రసు చెప్పాడు చీ. సుబ్బారావు.

'సి ఎస్. రావు' బోర్డు చూసి, "సార్ పోస్టు" అని కేకేసి కిటికీ లోంచి వెడ్డింగ్ కార్డు విసిరేశాడు వెంకట్రావు.

మరునటిరోజు అదే దారిన వెళుతున్న వెంకట్రావుని పిలిచి వెడ్డింగ్ చేతికిచ్చి "మాకు కాదు" అన్నాడు సి. ఎస్. రావు.

మతిపోయింది వెంకట్రావుకి. "సిహెచ్. సుబ్బారావులు ఇంకెవరున్నారు సుబ్బారావుగారూ!" అని అడిగాడు.

"సుబ్బారావా? ఏమయ్యా నా పేరు సుబ్బారావా? నా మొహం చూస్తే సుబ్బారావులా ఉన్నానా! ఐయామ్ రావు, సి. ఎస్. రావ్ అంటే సి. శ్రీనివాసరావు."

"ఐయామ్ సారీ సర్. చామర్తి సుబ్బారావుగారిల్లు రైట్ సైడ్ థర్డ్ హౌస్ అని చెప్పారు."

"అవునయ్యా...అదిగో పక్కిల్లు. మావి రైట్ సైడ్ సెకండు హౌస్‌లో సెకండ్ పోర్షన్!"

పక్కింటికెళ్ళాడు వెంకట్రావు. లోపలినించి "హోహో...హూ హూ..." అని కరాటే అరుపులు వినిపిస్తున్నాయి. "చామర్తి సుబ్బారావుగారూ, సుబ్బారావుగారూ" అని పిలిచాడు.

తలుపు తెరచి "ఖియా" అని అరిచాడు సుబ్బారావు.

ఉలిక్కిపడి వెనక్కి నాలు గడుగులు వేశాడు వెంకట్రావు.

"వచ్చే వారం హైద్రాబాద్‌లో టోర్నమెంట్సు. ప్రాక్టీస్ చేస్తున్నాను" చెప్పి వెడ్డింగ్ కార్డు తీసుకొని చూశాడు. "సుషీల్‌ది పెళ్ళి. సుషీల్ గాడికి పెళ్ళి...వామ్మో!" అని పెద్దగా ఏడ్చాడు చామర్తి సుబ్బారావు.

"అమ్మయ్య! మొత్తానికి కరెక్టు అడ్రస్‌కే చేరింది" అనుకొని "ఎందుకు సార్ ఏడుస్తున్నారు?" అడిగాడు వెంకట్రావు.

"ఏడవకేం చెయ్యమంటావ్? ఐయామ్ ఏన్ యంగ్ ఎనర్జిటిక్ యూత్ ఆఫ్ ట్వంటీ సిక్స్ వింటర్స్...అంటే నాకు ఇరవయ్యారేళ్ళు. ఒక్కసారన్నా పెళ్ళి చేశాడా మాఅన్న...! లేదు చెయ్యలేదు. నాకు పెళ్ళికాదు. ఈ సుషీల్ ఎవడో నాకు తెలియదు" అని వెడ్డింగ్ కార్డు తిరిగిచ్చాడు చామర్తి సుబ్బారావు.

నలుగురి చేతుల్లో సగం నలిగిన వెడ్డింగ్ కార్డు తీసుకొని బయల్దేరాడు వెంకట్రావు. ఎవరై ఉంటాడు ఈ సి.హెచ్. సుబ్బారావు. ఏం పని చేస్తాడో రాయలేదు. తండ్రి పేరుగాని, కనీసం ఇంటి నంబరుకూడా లేదు. ఎలా?..."ఏమండీ ఈ అడ్రెసు ఎవరిదో కొంచెం చెప్తారా?" దారిన వెళుతున్నాయన్ని ఆపి అడిగాను.

ముక్కు గట్టిగా పిండి, కుడిచేతి చూపుడు వేలు చెవిలో గిరగిరా తిప్పి "సి.హెచ్. సుబ్బారావా...ఆఁ...చేబ్రోలు సుబ్బారావుగా డయ్యుంటాడు. అదిగో ఆ కనిపించే వేపచెట్టున్న ఇల్లే!" అని చెప్పా డాయన.

"ఏ వేపచెట్టు సార్! అన్ని ఇళ్ళల్లోనూ వేపచెట్లు కనిపిస్తున్నాయి."

"ఏమయ్యా ఇంటికొక వేపచెట్టున్నట్లే. ప్రతి ఇంట్లోనూ సుబ్బారావనే వాడొక డుంటాడ్లు. నేరుగా చూడు. అయిదో వేపచెట్టున్న ఇల్లు."

"థాంక్యూ సార్" అని అయిదో వేపచెట్టున్న ఇంటికెళ్ళి చేబ్రోలు సుబ్బారావుగా రిల్లని కన్‌ఫర్మ్ చేసుకొని వెడ్డింగ్ ఇచ్చాడు వెంకట్రావు.

"ఏమోయ్, నేను కొంచెం కమల్‌హాసన్‌లా ఉంటానుకదూ!" కుడిచేత్తో బట్టతల సవరించుకొంటూ వెంకట్రావుని అడిగాడు చే. సుబ్బారావు.

అర్జంటుగా పోస్టుమేన్ ఉద్యోగానికి రాజీనామా చేసి బజ్జీల కొట్టు పెట్టుకుందా మనుకున్నాడు వెంకట్రావు. ఏం చెప్పాలో అర్థంకాక "ఈ వెడ్డింగు మీకేనాండీ?" అని అడిగాడు.

"సుందరి సుబ్బారావు సినిమాలో నన్ను హీరోగా యాక్టు చేయమని అడిగారోయ్. పద్మినీ కొల్హాపురి హీరోయిన్ అయితేనే నేను చేస్తానన్నాను. తరువాత చంద్రమోహన్‌తో తీశారనుకో!"

"అయ్యా! ఈ వెడ్డింగు తమరికేనా?" సీరియస్‌గా అడిగాడు వెంకట్రావు.

"సుషీల్, శ్వేత వెరీగుడ్ కాంబినేషన్ ఇండీడ్" అని "నాకు కాదయ్యా, బహుశా సోడాల సుబ్బారావు అయిఉంటాడు."

తల తిరిగింది వెంకట్రావుకి. "సి.హెచ్. సుబ్బారావు అనుంటే సోడాల సుబ్బారావు అంటారేమండీ?" అడిగాడు వెంకట్రావు.

"అదేనయ్యా, వాడి పేరు చుండూరి సుబ్బారావు."

"ఏం చేస్తుంటాడండీ?"

"ఎండాకాలం సోడాలు, మిగతా రోజుల్లో బీడీలూ అమ్ముతుంటాడు."

"అలాగా! ఎక్కడండీ అతనిల్లు?"

"కళ్ళుమూసుకొని స్ట్రెయిట్‌గా రెండు నిమిషాల పదిహేను సెకండ్లు నడిచి 'సోడాల సుబ్బారావు' అని కేకేసి కళ్ళు తెరువు. నీ ముందు ప్రత్యక్ష మవుతాడు" అని చెప్పాడు సుబ్బారావు.

"ఇదేదో మెంటల్ కేసులా ఉంది బాబోయ్" అనుకొని రెండు నిమిషాల పదిహేను సెకండ్లు నడిచి అన్ని దిక్కులూ చూశాడు వెంట్రావు. ఎడంపక్క మర్రిచెట్టు కింద గుడిసె, దాని ముందు సోడా బండి-పక్కనే చిన్న స్టూల్ మీద నిక్కరు వేసుకున్న పదిహేనేళ్ళ కుర్రవాడు కూర్చుని ఉన్నాడు.

"ఏమోయ్...సోడాల సుబ్బారావంటే నువ్వేనా?" అడిగాడు వెంకట్రావు.

అవునన్నట్లు తలాడించాడు ఆ కుర్రవాడు.

"మీ ఇంటి పేరు చుండూరి! అవునా?"

"అవును!"

"ఇదిగో నీకు వెడ్డింగ్ వచ్చింది!" చేతికిచ్చాడు వెంకట్రావు.

"అయ్యో! అమ్మమ్మా చచ్చిపోయావా...ఇక నాకు దిక్కెవరు దేవుడో!" అంటూ వెంకట్రావుని కౌగలించుకుని వెక్కివెక్కి ఏడ్చాడు సోడాల సుబ్బారావు.

వెంకట్రావుకి కూడా ఏడుపొచ్చింది. తమాయించుకున్నాడు.

"ఓయ్...ఓయ్ ఏమయింది? ఎందుకు ఏడుస్తున్నావు?" అడిగాడు.

"నువ్వేకదయ్యా ఏదో ఇంగ్లీషు పేరు చెప్పి నాకు వచ్చిందన్నావు. పోస్టోళ్ళు వచ్చి అట్లా ఇచ్చేది ఎవరన్నా చస్తేనేగదా? మా అమ్మమ్మ చచ్చిపోయిందిగా?" బోరుమని ఏడ్చాడు.

"అబ్బబ్బ...ఆపు మీ అమ్మమ్మ బాగానే ఉంది" అని చెప్పి పావలా ఇచ్చి సోడా తాగి దగ్గర్లో ఉన్న ఓ టీ స్టాల్ ముందు కూర్చున్నాడు వెంకట్రావు.

తన ఇన్నేళ్ళ సర్వీసులో ఇంత కష్టపడింది ఎప్పుడూ లేదు- వెడ్డింగ్ కార్డు మీద 'అడ్రెస్ నాట్ ఫౌండ్' అని రాస్తూ అనుకున్నాడు.

"సుబ్రావ్ ఓ టీ ఇవ్వు" అన్న పిలుపుతో ఉలిక్కిపడి "సుబ్బారావులు బాబోయ్ సుబ్బారావులు" అన్నాడు వెంకట్రావు.

"ఏమండీ...వెంకట్రావుగారూ సుబ్బారావులు అంటున్నారు" అడిగాడు టీ మాస్టరు.

"ఇక్కడ సుబ్బారావంటే ఎవరు?"

"నేనే!" అన్నాడు అతను.

"మీ ఇంటి పేరు?" అని అడిగాడు వెంకట్రావు.

"చల్లా...! చల్లా సుబ్బారావు...ఏంటి మనీఆర్డరు ఏమయినా వచ్చిందా?" నవ్వుతూ అడిగాడు సుబ్బారావు.

"సుషీల్ నీకు తెలుసా?"

"సుషీల్...!మా అక్కయ్య కొడుకు, మద్రాసులో ఉంటాడు. ఈ నెలలోనే వాడి పెళ్ళి."

"అమ్మయ్య! నాయనా సుబ్బారావూ నీకు వెడ్డింగ్ వచ్చింది." ఆనందబాష్పాలు రాలుస్తూ చెప్పాడు వెంకట్రావు. ★

